# సెక్రటరీ

## యద్దనపూడి సులోచనారాణి

"బామ్మోయ్! నాకు ఉద్యోగం దొరికింది." ఓరవాకిలిగా వేసివున్న తలుపుల్ని దభాల్న తెరుచుకుని లోపలికివస్తూ అంది జయంతి. "ఎక్కడ? ఆగాగు. అలా మీదపడితే నిలబడలేనే తల్లీ! హఠాత్తుగా సుడిగాలిలా ప్రవేశించి తనని చుట్టేసిన మనమరాలితో అలా నిలబడలేక గుమ్మందగ్గర కూలబడుతూ అన్నారు బామ్మగారు.

"సెక్రటరీ. మాంచి వుద్యోగం." కళ్ళలో ఆనందం మెరుస్తుండగా గర్వంగా అంది జయంతి.

"సెక్రటరీ అంటే?" బామ్మగారికి పంతులమ్మ, గుమాస్తా, టైపిస్టు యిలాటి ఉద్యోగాలే తెలుసు.

"అంటేనా? అంటే తెలుగులో కార్యదర్శి అన్నమాట. ఆంధ్ర వనితా విహార్ అని యీ వూళ్ళోకల్లా గొప్పసంస్థ. ఈ వూళ్ళోనేకాదు బామ్మా! మొత్తం ఆంధ్రప్రదేశ్ కంతటికీ గొప్ప. అక్కడందరూ ఆడవాళ్ళేలే వుండేది." చివరిమాట చిలిపిగా అంది జయంతి.

"ఆడ మగా భేదంపెట్టుకుంటే అసలు వుద్యోగాలకి వెళ్ళటమే అనవసరం. ఇంతకీ జీతం యెంత యిస్తారుట?"

"నూటయాభై" జయంతి కళ్ళలో మరోసారి గర్వం తళుక్కుమంది. వెంటనే బామ్మగారి మెడచుట్టూ చేతులువేసి గుండెల్లో మొహందాచుకుంటూ "ఇహ మనకష్టాలు గట్టెక్కినట్టే. నువ్వు రోజూచేసే పూజలు వృధాపోలేదు. దేవుడు మన మొర ఆలకించాడు. రేపటినుంచి నేనుగూడా రెండుపూటలా శ్రద్ధగా నమస్కారం చేస్తాను."

"ఏం గట్టెక్కటంలే! ఆడపిల్ల రెక్కలమీద బ్రతకాల్సివచ్చిన ఖర్మానికి...."

బామ్మగారి మాటలు పూర్తికానీకుండానే చెయిజాపి నోరుమూసేసిన జయంతి చివ్వున తలెత్తి "నేను సంతోషంగా వుండటం నీకిష్టంలేదులే? అయితే పో! నే నీ పూట అసలు అన్నం తిననే తినను." అంది తెచ్చిపెట్టుకున్న కోపం మొహంలో ప్రదర్శిస్తూ బుంగమూతిపెట్టి.

"లేదులేవేమ్మా! ఊరికే అన్నాను. అసలు నీయిష్టం కాదన్నది యెప్పుడు లే? పొద్దునెప్పుడో యెంగిలిపడి వెళ్ళావు. చూడు మొహం అంతా యెలా వాడిపోయిందో! లేచి త్వరగా స్నానంచేసి వస్తే భోంచేద్దువుగాని." ఒకచేత్తో మనమరాలి బుగ్గలు నిమురుతూ రెండోచేత్తో కళ్ళు తుడుచుకుంటూ అన్నారావిడ. రోజూ పూజలు చేసి భగవంతుడిని ప్రార్థిస్తున్న మాట నిజమే. కాని అది జయంతికి ఉద్యోగం కావాలనికాదు. ఏదైనా మంచి సంబంధం కుదిరి పిల్ల అత్తవారింటికి వెళ్ళిపోయేలా చూడమని. సాధ్యమైనంతత్వరలో తన నీ లోకంనుంచి విముక్తురాలిని చెయ్యమనీను. కాని భగవంతుడు ఆవిడ ప్రార్థనలని ఆ రూపంలో వినలేదు.

"పని బాగా వుంటుందన్నారా?" మరోసారి తన గుండెలలో తల దాచుకున్న జయంతి జుట్టు సరిచేస్తూ ఆప్యాయంగా అడిగిందావిడ.

"ఆ! ఉండచ్చు బహుశా. ఉంటే మటుకేం? పనికితగ్గ జీతందొరకటంలా?"

"వనితా విహార్ అంటే?"

"అంటే ఆడవాళ్ళ సంఘం అన్నమాట. ఇక్కడ ఆడవాళ్ళకి తీరిక వేళల్లో కుట్లు, అల్లికలు, హిందీ నేర్పుతారు. దిక్కులేని వాళ్ళకి ఆశ్రయమిచ్చి వాళ్ళచేత బుట్టలు అల్లించటం, బట్టలు కుట్టించటం, కాయగూరలు పండించటం, పూలతోటలు పెంచటం యిలాటి పనులు చేయించి, ఆ వచ్చిన డబ్బుతో వాళ్ళకి తిండి, బట్ట యిస్తారు. ఇది ఆంధ్రప్రదేశ్ మొత్తంమీద పెద్దది. ముఖ్య కేంద్రంకూడా. దీని శాఖలు దేశం అంతటావున్నాయి. ఒక మంత్రిగారి భార్య దీనికి ప్రెసిడెంట్. చాలా పెద్దపెద్దవాళ్ళు పలుకుబడివున్నవాళ్ళు దీనికి అండగా నిలబడి నడిపిస్తున్నారు. ముందు ఉద్యోగంవని, జీతంమాట అటుంచు. పెద్దపెద్దవాళ్ళందరితో పరిచయం అవుతుంది. అదృష్టంకదూ!"

గబగబా చెబుతున్న జయంతికి కళ్ళముందు బామ్మగారి గుండెల్లో మంత్రిగారి భార్యతో పరిచయం, దానితో స్నేహం, తర్వాత ఆవిడ భర్తకి జయంతిని చూపిస్తూ 'ఈ అమ్మాయి మా సెక్రటరీ అండీ' అనటం, తను సిగ్గుపడుతూ నమస్కారం చెయ్యడం అన్నీ కన్పిస్తున్నాయి. జయంతి బుగ్గలోకి వెచ్చటి ఆవిరివచ్చింది. తనుకూడా గొప్పవాళ్ళ సాంగత్యంతో గొప్పదైపోయి ఒక రోజుకి ఫలానా జయంతి అదుగో ఆ వెళ్ళే అమ్మాయే అన్పించుకోవచ్చు. అప్పుడెంత బాగుంటుంది!

"లే! లేచి త్వరగా స్నానం చేసిరా?" కుంపటిమీద వేగుతున్న కూర గుర్తుకు వచ్చిన బామ్మగారు జయంతిని తప్పించుకుని లేచి వెళ్ళారు.

ఆరాత్రి ఎలాగో వేడివేడి నీళ్ల స్నానం చేసి, నయించీ నయించనట్టు భోంచేసి

తెల్లటి వుతికిన బట్టలతో మంచంమీద వచ్చి పడుకున్న జయంతికి యెంతసేపటికీ నిద్ర రాలేదు. ఎంత బాగుందీ ప్రపంచం! సృష్టిలో కంటికి కన్పిస్తున్న ప్రతివస్తువు సజీవశక్తితో నూత్నానందంతో వెలిగిపోతున్నట్లుంది. ఆఖరికి మంచం ప్రక్కన కిటికీలోంచి లోపలికి వస్తున్న వెన్నెల కూడా అర్థంగాని ఏదో భాషలో పలకరిందా అని ప్రయత్నం చేస్తోంది. ఎంత వద్దనుకుని నిశ్చలంగా వుండాలన్నా, జయంతి ఆలోచనలు మాటిమాటికీ "ఆంధ్రవనితా విహార్" అని పెద్దపెద్ద అక్షరాలతోవున్న గేటుని కళ్ళముందుకు తెస్తున్నాయి. ఆ గేటుదాటి లోపలికి వెడితే ముందు విశాలంగావున్న ఆవరణలో చక్కగా పద్ధతి ప్రకారం పెంచిన పచ్చగడ్డి. నడిచేవాళ్ళకాళ్ళకి మట్టి కాకుండా పట్టుతివాసీమీద నడుస్తున్నామా అని భ్రమకలిగించే మెత్తటి పచ్చగడ్డి. దాని కిరుప్రక్కలా రకరకాల పూల మొక్కలు వచ్చేవాళ్ళకి స్వాగతం యిస్తున్నామన్నట్టు గాలికి తలూపుతూవుంటాయి అవి. అవివాటి ఆ పచ్చగడ్డిమీద బాగా ముందుకు వెడితే నున్నటి పాలరాతితో ధగధగా మెరిసే వరండా. వరండాలో ఆ చివరా, యీ చివరా చక్కటి శిల్పంతో చెక్కిన పెద్దపెద్ద స్తంభాలు. వాటిమధ్యగా వున్న గుమ్మంలోనుంచి లోపలికి వెడితే లోపల పెద్దహాలు. హాలునిండా వరసల ప్రకారం అమర్చిన నీలంరంగు వెల్వెట్ కుర్చీలు. కుర్చీలకి అటువైపుగా పెద్దస్టేజీ. ఆ స్టేజీని తనలోపల దాచేసుకుంటున్న పెద్ద పసుప్పచ్చటి వెల్వెట్ కర్టెన్. దాని మీద స్టేజీ ఆ చివరినుంచి యీ చివరికి వచ్చేటట్టు మధ్యలో రక్తవర్ణంలో "ఆంధ్ర వనితా విహార్" అని కన్పిస్తున్న అక్షరాలు. ఆ అక్షరాలు చూసేవాళ్ళ చూపుల్ని క్షణం సేపు తమవైపే ఆకట్టుకునేంత అందంగా వున్నాయి.

వరండాలోంచి వచ్చే గుమ్మాని కిరుప్రక్కలా పైకివెళ్ళటానికి మెట్లున్నాయి. ఆ మెట్లమీద బంగారపు అంచున్న ఆకుపచ్చ తివాసీ పరచివుంది. ఆ మెట్లెక్కి పైకివెడితే చిన్న వరండా. దాన్ని ఆనుకుని కొన్ని గదులు. ఆ గదులకి వరసగా సెక్రటరీ, ప్రెసిడెంట్, మీటింగ్ హాలు, లైబ్రరీ అన్న బోర్డులున్నాయి. మీటింగ్ హాలు కొద్దిగా పెద్దదే అని చెప్పచ్చు. అందులో ఓ ఇరవైమంది కూర్చునేందుకు కుర్చీలు. టేబిల్, చిన్న అల్మైరా. గదికి మధ్యగా సీలింగ్ ఫ్యాన్ వున్నాయి. వనితావిహార్ దాదాపు ప్రతినెలా యేదో ఒక ప్రత్యేక కార్యక్రమం జరుపుతూనే వుంటుంది. దానికి నిర్ణయించుకోవలసిన కార్యక్రమాన్ని రూపొందించడానికి, సలహాలు తీసుకోవడానికి, చర్చలు జరపడానికి కమిటీ సమావేశం అవుతూవుంటుంది. సెక్రటరీ గది కొంచెం చిన్నదిగా వుంది. అందులో చిన్న టేబిల్, ఫైల్సుపెట్టే రాక్, టైప్ మిషన్, యెవరన్నావస్తే కూర్చునేందుకు రెండు కుర్చీలు, టేబిల్ ప్రక్కన ఫ్యాన్, గదిలో మూలగా చిన్న టేబిల్ మీద ఫోన్ వుంది.

ఆ చిన్నగది గుర్తొస్తేనే జయంతికి స్వర్గంలో అడుగుపెట్టినట్టుగా అన్పిస్తోంది. వైస్‌ప్రెసిడెంట్ సుమిత్రాదేవి జయంతికి మొట్టమొదటిసారిగా ఆ గది చూపిస్తూ "ఇదుగో యిదే నీ గది. ఉదయం 10 గంటల





నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వుండాలి. ఆ లోపలవచ్చే ఫోన్ కాల్స్‌కి జవాబివ్వాలి. ముఖ్యమైన విషయాలుంటే నోట్ చేసుకుని అవసరమయితే నాకు ఇంటికి ఫోన్ చెయ్యాలి. ఏదయినా పనిబడితే మెంబర్స్ యింటికివెళ్ళి వివరాలు అందజెయ్యాలి. టైప్ వచ్చున్నావుగా?" అంది ఆవిడ టైపురైటర్ వైపు చూస్తూ.

"వచ్చు. కాని ప్యాసవలేదు." సిగ్గుపడుతూ జవాబు చెప్పింది జయంతి.

"ఓస్. ప్యాసవకపోయినా ఫర్వాలేదు. మాకు కావాల్సింది పనిగాని సర్టిఫికెట్లుగావు. రేపు వచ్చి జాయినవ్వు." బైటకుదారితీస్తూ అంది సుమిత్రాదేవి.

జయంతి ఒకడుగు వెనక నిలిచిపోయి యింకోసారి గదివైపు పరీక్షగాచూసి గుండెలనిండా గాలి పీల్చుకుంది. ఎంత బాగుంది గది. రేపటినుంచి తను చేయబోయే ఉద్యోగాన్ని గురించి పదేపదే తలుచుకుంటూ ఆరాత్రి కలత నిద్రపోయింది జయంతి.

జయంతి అంతా తన అదృష్టంగా మురిసిపోతున్న ఆ వనితా విహార్‌కి మంత్రిగారి భార్య ప్రెసిడెంట్ అన్నది నామమాత్రమే. అన్ని విషయాలు వైస్‌ప్రెసిడెంట్ సుమిత్రాదేవి చూస్తుంది. క్యాషియర్ కమలానంద్ అని ఒకావిడ వుంది. ఆవిడ ఊళ్ళో పెద్దపేరున్న డాక్టర్. తన ప్రాక్టీసుతోనే ఆవిడకి క్షణం తీరుబడి వుండదు. ఒకవేళ ఒకటీ. అరా వున్నా మిగతా పనులు బోలెడన్ని. ఇలాగే అందులో మెంబరుగా వున్న ప్రతివాళ్ళకి మిగతా బాధ్యతలు బోలెడన్ని. అందుకే కేవలం వనితా విహార్ లోకంగా పెట్టుకుని వుత్సాహంగా. సమర్థతతో నాలుగూ చక్కపెట్టుకు పోగల వ్యక్తి సెక్రటరీగా కావాలి. అందుకే అది మామూలు వ్యక్తికి వదిలేసే వుద్దేశంతో పేపర్లో ప్రకటించారు. వనితా విహార్ సంగతి, అందులో మసిలే వ్యక్తుల వ్యక్తిత్వాలు, ఆ ఉద్యోగం లోని సాధక బాధకాలు తెలిసిన యెవ్వరూ దానికోసం ప్రయత్నం చెయ్యలేదు అలా తెలియక చేసినకొద్దిమందిలో అర్హతలని బట్టిచూస్తే పదిమంది తేలారు. ఆ పదిమందిలో ఒక్క జయంతే ఇంటర్వ్యూలో నెగ్గింది. మనిషిని చూస్తూనే ఓవిధమైన వ్యక్తిత్వాన్ని సూచించే వేషభాషలు, ఆడంబరంలేని సంభాషణ, అడుగుపెడుతూనే అందరి చూపులూ తనవైపు ఆకర్షించుకోగల ఓవిధమైన అమాయకత్వంతో గూడిన అందం, ప్రవర్తనలో నిదానం, అన్నిటి కంటె ఆ అమ్మాయి యీ ఉద్యోగం పట్ల చూపుతున్న విపరీతమైన శ్రద్ధాసక్తులు వనితావిహార్ కమిటీ ఏకగ్రీవంగా జయంతిని సెక్రటరీగా అంగీకరించేలా చేశాయి.

స్వంత బొమ్మ తప్ప మరో వ్యక్తిని దగ్గరగా యెరుగని జయంతి, పుస్తకాల్లో కన్పించే ప్రపంచమే యీ ప్రపంచంకూడా అనుకునే జయంతి, అందరూ తనలాటివాళ్ళే అనే భ్రమతో తనకు దొరికిన ఈఉద్యోగం గురించి అది లభించటం కేవలం ఆకాశంలోనిజాబిలి అరచేతిలో చిక్కిందన్నట్టు వూహించటంలో ఆశ్చర్యంలేదు.

● ● ●

రోజూ బాగా బారెడు పొద్దు పైకివస్తేనేగాని. కప్పుకున్న దుప్పటి కదల్చటాని కిష్టపడని జయంతి మర్నాడు తెలతెలవారుతుండగానే లేచింది. 9 గంటలకల్లా భోంచేసి



వున్న బట్టల్లో తన కిష్టమైనవి వేసుకుని కొట్టుకునే గుండెలతో స్వప్నలోకంలో నడుస్తున్నదానిలా వనితావిహార్‌కి వచ్చింది. జయంతి వచ్చేటప్పటికి యెవరూ లేరు. కాపలావుండే రంగయ్యమటుకు వచ్చి తాళాలుతీసి జయంతిని తీసుకెళ్ళి లోపల కూర్చోపెట్టాడు. దాదాపు గంట పోయిం తర్వాత సుమిత్రాదేవి వచ్చింది. ఆవిడ ఒంటరిగా రాలేదు. వెంట నలుగురున్నారు. వస్తూనే పైన వరండాలో స్తంభందగ్గిర నిలబడ్డ జయంతిని వచ్చావా అన్నట్టుచూసి చిరునవ్వునవ్వి తలూపి వచ్చినవాళ్ళతో లోపలికి వెళ్ళిపోయింది. తనుగూడా వాళ్లతో వెనకాలే వెళ్లాలి అనిపించినా మళ్ళీ పిలవలేదుగదా అనే సంకోచంతో ఆగిపోయింది.

లోపల కమిటీహాల్లో కూర్చుని వాళ్ళేదో చాలాసేపు మాట్లాడుకున్నారు. బిగ్గరగా నవ్వుకున్నారు. కొంచెంసేపు కంఠం తగ్గించి గుసగుసలాడినట్టు మాట్లాడుకున్నారు. బైటవంటరిగా వాళ్ళకిచెందనిదానిలా స్తంభాని కంటుకుపోయి కాళ్ళు పీక్కుపోతూ అలా నిలబడటం జయంతికి చాలా విసుగనిపించింది. కాని, మొదటిరోజు విసుగుగాని, బాధగాని, నిరాశగాని చెందకూడదని మనసు నిబ్బరంచేసుకుంది.

గంట గంటన్నర ఆయిపోయింతర్వాత వచ్చినవాళ్ళు వెళ్ళిపోయారు. వాళ్ళతో పాటు యివతలకి వచ్చిన సుమిత్రాదేవి వాళ్ళని పంపేసి జయంతి దగ్గరకువస్తూ నవ్వుతూ "లోపల వచ్చి కూర్చోపోయావా? పోన్లే, రా!" అని జయంతిని తీసుకెళ్ళి చెయ్యవలసిన పనులన్నీ మరోసారిపురమాయించింది. ఆవిడ యివాళ చెప్పినదాంట్లో ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 5 గంటలకువరకూకాకుండా అవసరం అయితే ముందు రావాలి. ఆలస్యంగా వుండాలి. నెలనెలా జరిగే ప్రోగ్రామ్స్ నిర్ణయించి కమిటీ కాపీ ఒకటి సెక్రటరీకి పంపుతుంది. దానితో పాటు చెయ్యవలసిన పనులు ఆదేశిస్తూ మరో కాగితంకూడా వస్తుంది. ఏవైనాపనులు పడితే సభ్యుల యింటికి వెళ్ళి పనిచేసుకు రావాలి. ఇవన్నీ వరసగా ఆవిడ యే కరువుపెడుతుంటే జయంతికి సంతోషమే అనిపించిందిగాని, 'అమ్మో! యిన్నిపనులా' అన్పించలేదు.

ఆ రోజు పనిలో ప్రవేశిస్తున్నట్టు గుర్తుగా ఆ నెలాఖరులో జరగబోయే వార్ ఫండ్‌కి డబ్బు పంపటంకోసం ఏం ప్రోగ్రాం యేర్పాటు చెయ్యాలా అన్న నిర్ణయంకోసం



"శిల్పిగారూ! చౌకులోవున్న శివాజీబొమ్మ అద్భుతంగా చేశారండీ. కాని పోజుమాత్రం అదోలా వుందేమిటండీ?"

"ఏం చెయ్యను చెప్పండి. ముందు గుర్రంమీద శివాజిని చెయ్యమన్నారు. సగమయ్యాక గుర్రానికి డబ్బుల్లేవు. శివాజీతో సరిపెట్టమన్నారు."

కమిటీ సమావేశమౌతుంది. సుమిత్రాదేవి సభ్యులపేర్లు, టెలిఫోన్ నంబర్లు-యింటి అడ్రస్‌లు వున్న జాబితా యిచ్చి చూస్తూండమని వెళ్ళిపోయింది.

చూస్తుండగానే మధ్యాహ్నం అయింది. ఒక్కొక్కరే రావటం ప్రారంభించారు. అందరూ రకరకాలుగా వున్నారు. ఒకరికీ ఒకరికీ పొంతనేలేదు. భిన్న భిన్న ప్రకృతులు. భిన్న భిన్న వ్యక్తిత్వాలు. మీటింగ్ మొదలయ్యేముందు సుమిత్రాదేవి జయంతిని అందరికీ పిలిచి పరిచయంచేసింది. అందరి పేర్లు ఆసక్తిగావింటూ అత్యంత శ్రద్ధతో నమస్కారంచేసింది జయంతి. కాని వచ్చిన వాళ్ళెవరూ జయంతిని పట్టించుకున్నట్టే లేదు. సుమిత్రాదేవి చెబుతున్నది సాంతం వినకుండానే జయంతినిచూసీ చూడనట్టుగానే "ఓహో! యీ అమ్మాయేగదూ! అనో"అహ అలాగా!" అనో, "సంతోషం" అనో అని నిర్లిప్తంగా అనేసి వాళ్ళవాళ్ళ గొడవల్లో పడిపోయారు. నిరాశచెందకూడదని మొదలే నిర్ణయించుకున్న జయంతి ఒకరోజున వీళ్ళే శ్రద్ధాసక్తులతో తనవైపు చూసేలా చేసుకోవాలని మనసులో శపథం చేసుకుంది.

పరిచయం చెయ్యడం అయిపోయిన తర్వాత సుమిత్రాదేవికుర్చీలో కూర్చుంటూ "రాజశేఖరాన్ని కూడా రమ్మనమని ఫోన్ చేశాను. ఎందుకు రాలేదో-" అంది.

"వస్తానని చెప్పాడా? చెబితే తప్పకుండా వస్తాడు." నడినెత్తిన ముడివేసుకుని మిసెస్ రేఖారాణి అని పరిచయం చేయబడిన ఒకావిడ అంది. ఆవిడ వయసు చూస్తే 30 సంవత్సరాలుపైబడ్డట్టుంది. అలంకరణమటుకు 20 సంవత్సరాల లోపలవాళ్లు చేసుకునేలావుంది.

"ఏదో మీటింగ్ వుందట. వీలయితే వస్తానన్నాడు. లేకపోతే మన నిర్ణయంకాపీ పంపమన్నాడు."

"ఇంకేంమరి" అంది రేఖారాణి.

ఆడవాళ్ళకి సంబంధించిన యీ వనితా విహార్‌తో ఆ రాజశేఖరానికి ఏంసంబంధమో జయంతికి అర్థం గాలేదు. మెంబర్స్ లిస్ట్‌లో అతనిపేరు లేదు.

"ఈ సంవత్సరం అతనికి టెక్స్‌టయిల్ మిల్స్‌లో ఆరు లక్షలు లాభంవచ్చిందిట?" యెవరో రేఖారాణిని అడిగారు.

"ఆరుగాదు పదహారు" కరెక్టుచేసింది రేఖారాణి.

"ఏంవస్తే యేం లాభం? వూరివాళ్ళ పడితినటమేగా! ఓ యిల్లా, సంసారమా?" కళ్ళజోడుపెట్టుకుని పొట్టి ముక్కున్న మిసెస్ వర్మ యీసడింపుగా అంది.

"సంసారం లేకపోవచ్చు. బ్రహ్మాండమైన యిల్లుంది." కనుబొమలు ముడిచి అందులో తన కోపాన్ని దాచేసుకుంటూ అంది రేఖారాణి.

---

''సెక్రటరీ''కథలో పాత్రలు, సంఘటనలు కేవలం కల్పితం. ఇందులో వచ్చే సంఘటనలు గాని, వ్యక్తిత్వాలుగాని యెవరికైనా దగ్గిరగా అనిపిస్తే అందుకు నేను బాధ్యురాలిని గాను.


—రచయిత్రి.



"నా మొహం. ఆయిల్లు వుండీ లేనట్టే. పెళ్ళాం బిడ్డలు లేని యిల్లు కంటే వల్లకాడు నయం." నిర్లక్ష్యం అంతా పెదవి విరుపులో చూపిస్తూ అంది మిసెస్ వర్మ.

ఈసారి రేఖారాణితోపాటు మిగతావాళ్ళ మొహాలుకూడా యెర్రబడ్డాయి. గౌరవ మర్యాదలు, అందరిలో బోలెడంత పలుకుబడి, సంఘంలో పరువుప్రతిష్ఠలు పుష్కలంగావున్న వ్యక్తినిగురించి మిసెస్ వర్మ అలా తీసేస్తూ యీసడింపుగా మాట్లాడటం యెవరికీ నచ్చలేదు. రాజశేఖరం వ్యక్తిగతంగా యెలాటివాడయినా, అందరిలోకీ ధనవంతుడైన ఆతనితో ప్రతివాళ్ళకి పని ఉంటుంది. అన్నింటికంటె ముఖ్యంగా అతను యీ వనితా విహార్‌కి కన్పించకుండా బోలెడంత సాయం చేస్తున్నాడు. అతను వెన్నెముకలా అండగా నిలబడబట్టే వనితా విహార్ మంచిపేరు తెచ్చుకుని దేశం అంతా వ్యాపిస్తోంది.

అసహ్యం, రోషం దాగినస్వరంతో రేఖారాణి విసురుగా యేదో జవాబు చెప్పబోతుండగా విషయం ప్రక్కదోవలో పడుతోందని రెప్పపాటులో గ్రహించిన సుమిత్రాదేవి టేబిల్‌మీద ముందుకు వంగి గబగబా మాట్లాడేస్తూ "ఆ! ఆ! అసలు విషయానికి వద్దాం. ఇంతకీ ఏం చేద్దాం- నాటకం వేయిస్తే బాగుంటుంది కాని మంచి నాటకాలు వేసే వాళ్ళెవరున్నారు? శోసీ సుధామూర్తి సజెస్ట్‌చేసినట్టు సినిమాస్టార్ డాన్స్ పెట్టిస్తే?" అంది. నెమ్మదిగా తర్వాత అందరూ ఆ విషయాన్ని గురించి తర్కవితర్కాల్లో పడిపోయారు.



*ఇద్దరు ఋషులు హిమాలయాల్లో పక్కపక్క గుహల్లో తపస్సు చేసుకుంటుండేవారు. ఒకరిఉనికి ఒకరికి తెలిసినా ఎప్పుడూ కలుసుకోలేదు. ఇరవైఏళ్ళ తరవాత పెద్దాయన చిన్నాయనగుహకెళ్ళి కాసేపు లోకాభిరామాయణం మాట్లాడివెళ్ళిపోయాడు. అయిదేళ్ళ తరవాత మళ్ళీ ఆయనే చిన్నాయన గుహకివచ్చి పలకరించాడు.*

*"రండిరండి అన్నగారూ! ఏదేనా మర్చిపోయారా?" అన్నాడు చిన్నాయన.*

---

సుమిత్రాదేవికి కుడిప్రక్కనున్న కుర్చీలో కూర్చున్న జయంతికి యిదంతా తమాషాగా అన్పించింది. ఆ రేఖారాణీ అన్నావిడకి యీ మిసెస్ వర్మకి, కారణం యేమిటో తెలియదుగాని, బొత్తిగా పడదనీ తెలుస్తోంది. మిసెస్ వర్మమాటలతో కత్తులు నూరుతుంటే రేఖారాణి చూపులతో బాణాలు విసురుతోంది. మళ్ళీ యిద్దరిలో బోలెడంత చదువు - సంస్కారం వున్నట్టు కన్పిస్తోంది. కలిగిన కుటుంబాల్లో పుట్టి చిన్నప్పటినుంచి పదిమందితో కలిసి తిరగటం

నేర్పిన వీళ్ళకీ తగాదా యేమిటి? ఎవరి భావాలు వాళ్ళు దాచుకోలేని యీ బలహీనత లేమిటి? లేకపోతే యెందుకు దాచుకోవాలి అనే అహంకారమా! ఏదయినా కావచ్చు.

సుమిత్రాదేవి సూచనప్రకారం ప్రదర్శనకయ్యే ఖర్చులు పోను, వార్ ఫండ్‌కి పంపవలసిన మొత్తం తీసెయ్యగా కొంత వనితా విహార్‌కి మిగిలి తీరాలి. దాన్ని అందరూ అంగీకరించారు. తర్వాత టికెట్లు నిర్ణయించటంలో మళ్ళీ వాదోపవాదాలుజరిగినాయి. చివరికి అదికూడా తేలిపోయింది.

మీటింగ్ అయిపోతుండగా సుమిత్రాదేవి ఆదేశించినప్రకారం క్రిందకెళ్ళి రంగయ్య చేత టీ తెప్పించి అందరికీ తనే స్వయంగా అందిచ్చింది జయంతి. పనైపోవటంవల్ల ఒక్కొక్కరే సుమిత్రాదేవికి చెప్పి వెళ్ళిపోతున్నారు. ఎంతో ఆప్యాయంగా వాళ్ళ యోగక్షేమాలు అడుగుతూ మధ్యమధ్య తనింట్లో యిచ్చిందులు వెళ్ళటోసుకుంటు మాట్లాడి పంపిస్తోంది సుమిత్రాదేవి.

మొదట రేఖారాణి వెళ్ళిపోయింది. కొద్ది సేపయింతర్వాత సుమిత్రాదేవితో ఆ కబురు ఈ కబురు చెప్పి మిసెస్ వర్మ వెళ్ళింది. అందరిదగ్గర సెలవుతీసుకున్న సుమిత్రాదేవి దూరంగా నిలబడిన జయంతిని దగ్గరకిపిలిచి టేబిల్‌మీద పెట్టిన కాగితాలుతీసి అందిస్తూ "ఇదుగో యిది టైప్‌చేసి తలా ఒక కాపీ." అంటుండగానే యింతలో బైటనుంచి "నోర్ముయ్" అన్న రేఖారాణి స్వరం వినిపించింది. దానివెంటనే "షటప్" అన్న మిసెస్ వర్మ గొంతుకూడా వినిపించింది. జయంతితోపాటు సుమిత్రాదేవికూడా ఉలిక్కిపడింది. క్షణంసేపు ఆవిడ కళ్ళు, కనుబొమలు కుంచించుకున్నాయి.

వెంటనే చేతిలో వున్న కాగితాలు జయంతిమీద పడేసి, "కర్మ! దీనికి వైస్ ప్రెసిడెంట్‌గా వుండే కంఠాలీ గాదిదలు కాయటం సులభం-" అని సణుక్కుంటూ స్థూలకాయాన్ని వూపుకుంటూ గబగబా ముందుకు వెళ్ళింది. తనమీదపడి క్రింద బడబోయిన కాగితాలని భద్రంగా పట్టుకుని జయంతికూడా ఆవిడ వెనకాలే వెళ్ళింది.

"చూడండి. కాలుతొక్కి పైగా యెలా పేలుతోందో?" రేఖారాణి కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి.

"చూడలేదని చెప్పలేదూ?" మండిపడుతూ అంది మిసెస్ వర్మ.

"కళ్ళు కన్పించటంలా? అంత నెత్తిన పెట్టుకుని యెందుకు నడవాలి?"

విసురంతా కళ్ళలోనే గాక కంఠంలో కూడా చూపిస్తూ అంది రేఖారాణి.

"వినండి ఆవిడ మాటలు" అంటూ సుమిత్రాదేవివైపు తిరిగి "నేను చూడక తొక్కిన మాటనిజం. ఆవిడ ఒక్కనిమిషం ఆగితే నిజంగా క్షమాపణ చెప్పేదాన్ని. కాని యిప్పుడనవసరం. నే వెడుతున్నాను." మిసెస్ వర్మ క్షణంలో టకటక మెట్లు దిగి వెళ్ళిపోయింది.

"చూశారా ఆ పొగరు." మిసెస్‌వర్మ వెళ్ళినవైపే చూస్తూ పళ్ళుకొరుకుతూ అంది రేఖారాణి.

"చూస్తూనేవున్నా. ఈవిడ పద్ధతి బొత్తిగా బాగాలేదు." కళ్ళజోడు సరిచేసుకుంటూ అంది సుమిత్రాదేవి.



"తెలిసికూడా అన్నీ చూస్తూ మీ రెందు కూరుకుంటున్నారో నాకు అర్థం కావటం లేదు. ఆవిడని మెంబర్‌గా యెందుకు తీసెయ్యరు?"

"ఎలా! మంత్రిగారికి దగ్గిరచుట్టమే!" నిస్సహాయంగా చూస్తూ అంది.

"అయితే? ఇందాకమటుకు యిందాక చూశారా!"

"అవును. అవును. అతన్నిగురించి అలా మాట్లాడాలంటే యెంత ధైర్యం కావాలి?"

"ధైర్య మెందుకు? మిడిసిపాటుంటే చాలు. ఊరివాళ్ళంతాపడి అతని సంపద తింటున్నారుట-అది యీవిడ కెందుకో? అతనిష్టం. మీకు ఆవిడని మెంబరుగా తీసెయ్యటం చాతకాకపోతే చెప్పండి. రాజశేఖరానికి చెప్తే సరి. ఇలాటివాళ్ళని అతను క్షణంలో వంచగలడు."

కళ్ళజోడు తీసుకుని చీరకొంగుతో తుడుచుకుంటున్న సుమిత్రాదేవి ఖంగారుగా "వద్దు రేఖారాణీ! ఇప్పుడలాటివి యేవీ వద్దు. చాలా గొడవౌతుంది. సమయంరానీ. చెప్దాం. దానికే నేనూ చూస్తున్నాను. ఎప్పుడూ నెవం మనమీద వుండకోగూడదు." అంది.

"సరె, మీ యిష్టం. నే వస్తాను." రేఖారాణి వెళ్ళిపోతుంది.

"వెధవగోల. ఇద్దరూ యిద్దరే. కొరివి దయ్యాలు" సుమిత్రాదేవి మొహంలో ప్రసన్నత రేఖారాణితోపాటే వెళ్ళిపోగా మళ్ళీ కనుబొమలు ముడుచుకుని తిట్టుకొంటూ వెనక్కితిరిగింది. తిరుగుతూనే తన వెనకే బొమ్మలా నిలబడ్డ జయంతినిచూసి క్షణంసేపు తెల్లబోయి ఆ వెంటనే కోపంతెచ్చుకుంటూ "నువ్విక్కడే వున్నావా? నీకు చెప్పినపని వదిలేసి వింతచూస్తున్నావా? వెళ్ళు-వెళ్ళు-టైప్‌చెయ్యి" అంది.

జయంతి కాగితాలు తీసుకుని తనగదిలోకి వెళ్ళిపోయింది. అది టైప్‌చేస్తుండగా సుమిత్రాదేవి వచ్చి "నేను వెడ్తున్నాను. టైప్ చేసివుంచితే నేను రేపువచ్చి సంతకాలు చేస్తాను. పనికాగానే నువ్వెళ్ళిపో." అంటూ పురమాయించి వెళ్ళబోతూ హఠాత్తుగా ఆగి వెనక్కితిరిగి జయంతి దగ్గిరగావచ్చి "ఇదుగో! అమ్మాయి. పెద్దదానిని చెబుతున్నాను. నువ్విక్కడ నాలుగురోజాలుండా

---

● రంగస్థలంమీద నటిస్తున్న ఒక నటుడు - "పాతాళంబున -" అని పద్యంయెత్తుకుని, చేతితో యాక్షన్ చేస్తూ, ఆ చేతిని ఆకాశంవంక చూపించాడు. ప్రేక్షకులు గొల్లుమన్నారు. ఐతే, అతడు చేసిన యాక్షన్ రైటేనని శ్రీ శ్రీ సమర్థించారు. ఏమిటంటే - ఆంధ్రనాటకరంగం అధోగతిలో వుంది కాబట్టి, ఆ రంగంమీద వున్న నటుడు "పాతాళంబున -" అని చెయ్యి పైకెత్తి యాక్షన్ చెయ్యటంలో పొరపాటేమీ పడలేదని!

— సుకుమార్

అనుకుంటే యీ గొడవలేం పట్టించుకోకు. నీ పనేదో నువ్వు చూచుకుని నీ దారిని నువ్వెళ్లు. ఇలా జరిగిందని, అదని యిదనీ యెవరితో అనగూడదు. ఇక్కడిమాట యీ నాలుగ్గోడలు దాటి బైటికి పోగూడదు. తెలిసిందా! గుర్తుంచుకో" అని వెళ్ళిపోయింది.

టైప్‌రైటర్‌కి కాగితాలు బిగిస్తున్న జయంతి తెల్లబోయి అలాగే కూర్చుండిపోయింది. బాగుంది. తనేదో తప్పుచేస్తున్నట్టు యీ వార్నింగేమిటి? నయం అనుకుంది. అసలు రాజశేఖరం అన్నవ్యక్తి యెవరు? రేఖారాణి కేమౌతాడు! అతనంటే మిసెస్ వర్మ కెందు కింత యీసడింపు? అసలు వీళ్ళిద్దరికీ యెందుకుపడదు! ఎంత వద్దనుకున్నా ఆ సంఘటనని జయంతి మనసులోంచి తుడిచివేయలేకపోయింది. వనితావిహార్ సెక్రటరీగా జయంతి జీవితంలో మొదటిరోజు అలా గడిచిపోయింది.

● ● ●

జయంతిలో చలాకీతనం, వ్యక్తిత్వం నిరూపించుకోటానికా అన్నట్టు వార్‌ఫండ్‌కి నిధి పోగుచెయ్యటంకూడా ఆ నెలలోనే వచ్చింది. తిండి తిప్పలమాట మర్చిపోయి, ఎండ, వానని లక్ష్యపెట్టకుండా కమిటీ ఆదేశించిన ప్రకారం సుమిత్రాదేవి సలహాలు తు. చ. తప్పకుండా జయంతి యిల్లిల్లు తిరిగి టిక్కెట్లు అమ్మింది.

కొత్త సెక్రటరీ పుణ్యమా అని ఈమధ్య యెప్పుడూ అమ్ముడుపోనన్ని టిక్కెట్లు అమ్ముడుపోయినాయి. అనుకున్నదానికి రెట్టింపుకంటె పైనే వసూలైంది. ఆ వసూలైన మొత్తాన్ని చాటంత మొహంచేసుకుని తెచ్చిపెట్టుకుంటూ "భేష్! సెబాష్!' నాకు నచ్చావు. నీలాటివాళ్ళు నలుగురు నా చేతి క్రిందవుంటే చాలు. వనితావిహార్ని ప్రపంచమంతా విస్తరింపచెయ్యగలను." అంది సుమిత్రాదేవి.

ఆ కాస్త మాటకే జయంతి లేత హృదయం పురివిప్పిన నెమలిలా నాట్యం చేసింది. ఉదయంనుంచి భోజనం లేకపోయినా. సుమిత్రాదేవి గుక్కెడు కాఫీ నీళ్ళయినా పోయకపోయినా, కొన్నిరోజుల నుంచి యిల్లువాకిలి పట్టకుండా కాకిలా తిరుగుతున్నావని బామ్మ కోప్పడుతున్నా జయంతికివేం పట్టలేదు. మనసంతా సంతోషంతో పుక్కిరిబిక్కిరిగా వుంది. ప్రపంచంలో వున్న ప్రతి వస్తువు. చివరికి చెట్టూ, చేమ, యిల్లు, రోడ్లూ, బస్సులు అన్నీ తన విజయాన్ని చూసి అభినందిస్తున్నట్టే కన్పించింది. ఈరోజే యేముంది? అసలు నాట్యప్రదర్శనరోజు. ఆరోజుగాని జయంతి కష్టానికి ప్రతిఫలం దొరకదు, ఆరోజుగాని అందరికీ జయంతి ఫలాన అని తెలియదు. అంతవరకూ యిలా మామూలుగా వుండిపోవాల్సిందే! అప్పుడుగాని తన వ్యక్తిత్వం యెవరికీ తెలియదు. జయంతి మనసులో నుంచి నిట్టూర్పు వచ్చింది. హు! అవకాశాలంటూ కలగాలి గాని తనలాటివాళ్ళు పర్వతాలు యెత్తెయ్యలేరూ?

ఎంతో ఆనందంతో. కోటికాంతులు వెలిగిపోతున్న కళ్ళతో. పీక్కుపోయిన మొహంతో నడుస్తున్నట్టు గాకుండా అలల మీద అతి తేలికగా కదిలిపోతున్నట్టు యింటికి వచ్చిన జయంతి తలుపుతట్టటంతోనే లోపల్నుంచి వచ్చిన బామ్మగారు



జయంతిని చూస్తూనే ధుమధుమలాడుతున్న మొహంతో. "ఏం ఉద్యోగమే నాతల్లీ! పొద్దున ప్రక్కమీదనుంచి లేచిపోయిన దానివి యిప్పుడా రావటం? ఓ తిండిలేదు - తిప్పలులేదు. భోజనం బొగ్గులు అక్కర్లేకుండా నువ్వెలిగిస్తున్న ఆ రాచకార్యమేమిటో కొంచెం చెప్పు వింటాను" అంది గుమ్మాని కడ్డంగానిలబడి.

"ముందు లోపలికి రానిస్తావా లేదా?" పాటపాడుతున్నట్టుగా అంది జయంతి.

బామ్మ దారియిచ్చింది.

"పొద్దుననుంచి చూసిచూసి నా ప్రాణం విసిగింది. అసలు-"

"బామ్మా! ప్లీజ్" జయంతి మధ్యలోనే ఆపేసి బామ్మగారి రెండుభుజాలమీద చేతులు వేసి కళ్ళలోకి చూస్తూ "మై డియర్ బామ్మగారూ! ఈ రోజు మనం చాలా సంతోషంగావున్నాం. దయుంచి నువ్వే మీ అనద్దు-" అంది.

"పైగా యిదొకటి. మాట్లాడ్తే నోటికి తాళంవేస్తావు. ఆ యెదురింటి వనజచూడు-"

"పో బామ్మా! మందని మళ్ళేనే వుద్యోగంచేసే పంతులమ్మకి నీ మనమరాలికి పోలికా?" అని వెంటనే చేతులుతీసేసి "ఆకలేస్తోంది. రెండు నిమిషాల్లో స్నానం చేసి వస్తాను. పెట్టు" అంది.

ఎప్పుడూలేంది లలలూ.లలలూ. లాలలూ అంటూ కూనిరాగం తీస్తూ పాటలు పాడుతూ నీళ్ళు పోసుకుంటున్న మనమరాలి వైపు బామ్మగారు వింతగా చూసింది. జయంతి కూనిరాగం తీస్తూనే అన్నం తింది. అట్లాగే నిద్రపోయింది కూడా.



హోటలువాడితో గెస్టు: "అయ్యా: నా గదికి ఒక నిలువుటద్దం పంపిస్తారా?"

హో. వా.: "ఏం, ఇప్పుడున్నది నిలువుటద్దంలో సగం వుంది. చాలదుటండీ?"

అతిథి: "చాలదు కనకే అడుగుతున్నా. నిన్న మొన్న లాగూ వేసుకోకుండానే బయటికి వెళ్ళా."

---

"భగవంతుడా! ఈడు వచ్చిన యీపిల్ల ఉద్యోగం యేమిటి? ఈతిరగడం ఏమిటి? నన్ను కనికరించు భగవాన్ -" పసిపిల్లలా ప్రక్కకు తిరిగి సగం బోర్లగా పడుకున్న జయంతి తలక్రింద దిండు సరిచేసి పక్కగా పడుకుంటూ దేవుడిని ప్రార్థించసాగింది బామ్మగారు. ఆవిడ యీ అరవై సంవత్సరాల్లో ప్రపంచంలో మంచికంటె చెడే యెక్కువ చూసింది. న్యాయంకంటే అన్యాయమే కన్పించింది ఆవిడకి. జయంతి వెర్రిబాగులపిల్ల. సాధ్యమైనంత త్వరలో పెళ్ళయేలా చూడమని ఆ రాత్రి మరీమరీ ప్రార్థించసాగింది.

జయంతి లక్ష కళ్ళతో యెప్పుడా యెప్పుడా అని యెదురుచూసిన ఆ రోజు రానేవచ్చింది. ఉదయం 9 గంటలకే యేదో యింత సయించీ సయించనట్టు బొమ్మ బలవంతంమీద భోంచేసిన జయంతి తనకివున్న ఒకే ఒక మంచి చీర లేత గులాబీరంగు జార్జెట్ చీర, అదేరంగులో కొద్దిగా ముదురుగావున్న గులాబిరంగు క్రేప్ జాకెట్ వేసుకుని వనితావిహార్‌కి వచ్చేసింది.

ఈ రోజు జయంతి చెయ్యాల్సిన పనులు బోలెడన్ని వున్నాయి. పదిమంది పెట్టు తనే చేస్తోంది. అయినదానికి కానిదానికి ప్రతి దానికి ప్రతిఒక్కరూ జయంతీ జయంతీ అని పిలిచేవాళ్ళే. అందరికీ జయంతిపేరు నాలిక చివర వుండిపోయింది. ఒక్కళ్ళు మాట కూడా కాదనలేదు. ఎవరిమనసూ నొప్పించ లేదు. జయంతి ప్రపంచంలో విసుగు అనే ఒక మాట వుందని ఆక్షణంలో పూర్తిగా మర్చిపోయినట్టే కన్పించింది. గాలికంటె వేగంగా, మెరుపుకంటె చురుగ్గా, అలల కంటె తేలికగా నడుస్తున్న జయంతి గిరగిర బంగారుతీగెలా తిరుగుతూ ప్రతివాళ్ల చెయ్యి అందుకుని ఆ పనిలో సాయపడ సాగింది.

సాయంత్రం అయిపోయింది. వనితా విహార్ ముందు స్వాగత పూర్వకంగా అందంగా తీర్చి దిద్దిన వరస ప్రకారం అమర్చిన రంగురంగుల దీపాలు వెలిగాయి. చూస్తుండగానే జనం గుంపులు గుంపులుగా రాసాగారు. హాలంతా నిండిపోయి కిటకిట లాడసాగింది. అక్కడే నిలబడిన జయంతి సుమిత్రాదేవి ఆదేశించిన ప్రకారం స్పేరుగా తెప్పించి పెట్టిన కుర్చీలు వేయించి వచ్చిన వాళ్ళకి కూర్చునేందుకు స్థలం చూపించ సాగింది.

ఇంత గందరగోళంమధ్య జయంతి ఒక విషయం గ్రహించకపోలేదు. బోలెడంత డబ్బు పెట్టి టిక్కెట్లు కొన్నవాళ్లు యెవరూ రాలేదు. ఒకవేళ వచ్చినా చాలాకొద్దిమంది వుండి వుంటారు. మర్యాదకోసం యిచ్చిన ప్యాసులమీదమటుకు బ్రహ్మాండంగా వచ్చారు, ఒక్కొక్క ప్యాసుమీద కనీసం అరడజనుకి తక్కువలేకుండా. అందుకే హాలు కిటకిట లాడి చోటు చాలటంలేదు.

మొదటి తరగతి ఎంట్రెన్స్ దగ్గిర జయంతిని నిలబడమని చెప్పింది సుమిత్రాదేవి. పెద్దపెద్దవాళ్ళు చాలామంది వస్తారు. జాగ్రత్తగా స్వాగతం చెప్పి వాళ్ళకి కూర్చునేందుకు చోటు చూపించాలి. జయంతి అలాగే నిలబడిపోయింది. ఎవరో వచ్చారని కుర్చీలు తెప్పించి లోపల వేయిస్తున్న జయంతి యింతలో ప్రక్కవాళ్ళు "మంత్రిగారు" "మంత్రిగారు" అనటంతో వేయిస్తున్న కుర్చీలు వదిలేసి బైటకు పరుగెత్తుకొచ్చింది. జయంతి మనుష్యుల్ని తప్పించుకుని వచ్చేలోపలే మంత్రిగారు స్టేజీదగ్గరకు వెళ్ళిపోయారు. ఏదోపనిమీద ఆయనతో వెళ్ళకుండా వెనక దిగబడిపోయిన సుమిత్రాదేవి గుమ్మం ప్రక్కన వూరికే నిలబడిపోయిన జయంతిని చూస్తూ విసుక్కుంటూ "అదేమిటి? ఇప్పుడేనా అలా నిలబడేది? అక్కడ జనంనిలబడ్డారు. కుర్చీలువేయించమని చెప్పాలా" అంది. హఠాత్తుగా లభించిన యీ తిరస్కారంతో జయంతి మనసు చివుక్కుమనటమే గాకుండా కళ్ళలో నీళ్ళు కూడా తిరిగాయి. ఇంతలో అటువైపుగా వచ్చిన మిసెస్ కరుణాకరం "అరె! అక్కడ వాళ్ళంతా నిలబడిపోయారే" అంటూ పరుగెత్తికెళ్ళి కుర్చీలు సర్దివేసి కూర్చోపెట్టింది. ఒక్క కరుణాకరమేగాదు మిగతా అందరూ అంతే. యెవరిని చూసినా వనితావిహార్ భారం అంతావాళ్ళే మోస్తున్నట్టు చురుగ్గా పనిచేస్తున్నారు.

మొదటి తరగతి ఎంట్రెన్స్ దగ్గర వలంటీర్‌గా నిలబడిపోవటంతప్ప యింకేం చెయ్యాలో జయంతికి అర్థం గాలేదు.

ప్రోగ్రాం మొదలయ్యేముందు అరచేతి మందాన వెడల్పాటి జరీఅంచుగల పట్టుచీర కట్టుకుని, వంటినిండా రాళ్ళనగలతో ధగధగ మెరిసిపోతూ మంత్రిగారి భార్య ప్రెసిడెంట్ హోదా ఒలకబోస్తూ స్టేజీమీదకు నడిచివెళ్ళి రిపోర్టు చదివింది. ఆయాస పడుతూ, తడబడుతూ, మధ్యమధ్య ఆగి చెమట తుడుచుకుంటూ. సవాలక్ష తప్పులతో ఆ యింగ్లీషులో ఆ రిపోర్టు చదవకపోతే హాయిగా తెలుగులో చదవకూడదూ అన్పించింది జయంతికి. అదే తనే అయితేనా? జయంతి బుగ్గల్లోకి వెచ్చటి ఆవిరివచ్చింది. ఇదేమిటి అందరూ యిలా ఒక్కసారిగా తనని మర్చిపోయారెందుకు!

అధ్యక్షత వహించిన మంత్రిగారులేచి అరగంటసేపు మధ్యమధ్య స్టేజీకి ఓ ప్రక్కగా నిలబడిన భార్యవైపు సగర్వంగా చూసుకుంటూ వనితావిహార్ చేస్తున్న నిస్వార్థసేవని వేనోళ్ళ కొనియాడుతూ, కనీసం కొన్ని సంస్థలయినా యిలా పనిచేస్తే దేశం చాలా బాగుపడుతుందని, ఆడవాళ్ళు యీ అత్యవసర పరిస్థితుల్లో ముందడుగు వేసి దేశ రక్షణ బాధ్యతను తాముకూడా పంచుకుంటే పురుషులకి తేలికౌతుందని చెప్పారు. దాదాపు గంటసేపు సుదీర్ఘంగా యిచ్చిన ఆయన ఉపన్యాసంలో పేరుపేరునా వనితావిహార్‌కోసం కష్టపడుతున్న వాళ్ళని గురించి పొగిడాడు. కాని అంత దీర్ఘంగా వున్న ఆ వుపన్యాసంలో జయంతిపేరు మచ్చుకికూడా విన్పించలేదు. చిట్టచివర యింకా చాలామంది యిందులో పనిచేశారు అంటూ ఓ లిస్టు చదివాడు. ఆ లిస్టులో యెక్కడో పదిమందిలో జయంతి తన పేరు విన్పించిందో లేదో కూడా మరిచిపోయింది.

నిలబడి నిలబడి కాళ్ళు పీక్కుపోతున్న జయంతి హఠాత్తుగా బాగా నీరసం అనిపించటంతో స్పేరుగా పెట్టివున్న కుర్చీల్లో తనే వెళ్ళి ఒక కుర్చీ తెచ్చుకుని మొదటి

---

● ఆమధ్య మద్రాసులో ఒకసభ జరిగింది. ఆ సభకు డాక్టర్ పి. వి. రాజమన్నారు అధ్యక్షతవహించారు, సభారంభంలో స్వాగత వాక్యాలు ముగిసిన తర్వాత, అధ్యక్షులు లేచి, కార్యక్రమంగల కాయితాన్ని చూసి, "తర్వాత, ప్రెసిడెంట్స్ అడ్రస్— "అని చదివి, "నెంబరు 9 విక్టోరియా క్రిసెంటురోడ్డు ఎగ్మూరు, మద్రాసు "అని చటుక్కున కూచున్నారు!

— సుకుమార్

తరగతి ఎంట్రెన్స్ గుమ్మానికి కొంచెం ప్రక్కగా వేసుకుని కూర్చుండిపోయిందిక్ష్ నాట్యం మొదలైంది. ముందువరసలో సోఫాలో కూర్చున్న మంత్రిగారికి కుడివైపు రేఖారాణి. యెడంవైపు మిసెస్ వర్మ కూర్చునివున్నారు.

నాట్యం మొదలవగానే ఆలోచనలన్నీ మర్చిపోయి ఆటే చూడటంలో నిమగ్నురాలైపోయిన జయంతి చాలా సేపయింతర్వాత తన వెనక యెవరో నిలబడ్డట్టు తోచటంతో పులిక్కిపడి వెనక్కి తిరిగి చూసింది. పొడుగ్గా తెల్లగా బాగా నిలువెత్తు మనిషి. నిగనిగలాడుతున్న నల్లటి జుట్టుతో, తెల్లటి బట్టల్లోవున్న అతను చేతులుకట్టుకుని ఆదోరకమైన ఠీవితో నిలబడి తదేకంగా డాన్స్ చూస్తున్నాడు. కూర్చున్న జయంతి గిరుక్కున వెనక్కి తిరగటంతో డాన్సు చూస్తున్న అతనుకూడా కళ్ళుతిప్పి జయంతి వైపు చూశాడు.

జయంతి చప్పునలేచి నిలబడి ''లోపలికి వెళ్ళండి" అంది. అతనెవరో ఫలాన అని తెలియకపోయినా గౌరవ మర్యాదలు యివ్వవలసిన మనిషిగానే కన్పించాడు. జయంతికి బాగా దగ్గిరగా నిలబడివున్న అతను జయంతి మాటలకి యేమాత్రం కదలకుండా చిరునవ్వుతో "ఫర్వాలేదు. మీరు కూర్చోండి. డాన్స్ అయిపోవచ్చింది" అన్నాడు. జయంతికూర్చుండిపోయింది. మళ్ళీ ఇద్దరూ డాన్సు చూడటంలో నిమగ్నులైపోయినారు.

ప్రోగ్రాం దాదాపు అయిపోతుండగా యింతలో హఠాత్తుగా యెక్కడినుంచో వూడిపడిన సుమిత్రాదేవి గబగబా వస్తూ "అరె మీరిక్కడున్నారా? లోపలికి వెళ్ళలేదేం? మీకు మంత్రిగారి పక్కన ఖాళీ వుంచిన సోఫా అలాగే వుండిపోయింది. అరె! జయంతీ! వారు నిలబడి వుంటే నువ్వు కూర్చున్నావా?" అంది గట్టిగా మందలిస్తూ. సంగతేమిటో తెలియని జయంతి లేచి నిటారుగా నిలబడి యిద్దరివైపు చూడసాగింది.

"నో! నో! నేనే లోపలికి వెళ్ళనన్నాను. అసలు నేను వచ్చింది కూడా యిప్పుడే" అన్నాడతను చేతులు పాంట్ జేబుల్లో పెట్టుకుంటూ. "అలాగా! యీ అమ్మాయి మా సెక్రటరీ కొత్త పాపం. తెలియదు." జయంతిని పరిచయం చేస్తూ అంది సుమిత్రాదేవి. జయంతి రెండుచేతులు జోడించి నమస్కారం చేసింది. అతను చేయలేదు. చేతులింకా అలాగే పాంట్ జేబుల్లో పెట్టుకుని తలమటుకు వంచుతూ "అవును. ఎవరినో అప్పాయింట్ చేశారని విన్నాను. పేరు?" అన్నాడు. జయంతి కళ్ళలోకి సూటిగా చూస్తూ.

"జయంతి" జయంతితోపాటు సుమిత్రాదేవికూడా చెప్పింది. అతనెవరో పరిచయం చేస్తుందేమో అనుకుంది జయంతి. అదేం అవసరం లేనట్టు సుమిత్రాదేవి వెళ్ళిపోయింది. ఆవిడ వెనకే అతను వెళ్ళిపోయాడు. ప్రోగ్రాం అయిపోయింది. జనం గుంపులు గుంపులుగా యివతలకివచ్చేస్తున్నారు. వాళ్ళకి దారియిస్తూ గుమ్మంప్రక్కగా నిలబడిపోయిన జయంతిదూరంగా వెళ్ళిపోతున్న సుమిత్రాదేవివైపు. అతనివైపు చూడసాగింది. అతను నిలబడ్డప్పుడే గాదు. నడుస్తుంటేకూడా, వెనకనుంచి చూసినా మనిషి మంచి హుందాగా నిండుగా వున్నాడు.

టైటకొచ్చేసిన మంత్రిగారు వెళ్ళికారులో కూర్చున్నారు. కారుచుట్టూ చాలామంది మూగారు. వాళ్ళందరిలో పొడుగ్గా వుండటం వల్లనేమో అతను స్పష్టంగా కన్పిస్తున్నాడు. అందరూ ఆడంబరంగా వీడ్కోలుయిచ్చారు. మంత్రిగారి కారు కదిలి వెళ్ళిపోయింది. జయంతిలో నుంచి యెంతబలవంతాన ఆపుకోవాలన్నా ఆగని నిట్టూర్పొకటి బైటకు వచ్చింది. మంత్రిగారు రానూవచ్చారు. వెళ్ళనూవెళ్ళారు. తను పరిచయం చేయబడనేలేదు.

చూస్తుండగానే జనం పలచబడిపోయారు. హాలు ఖాళీ అయిపోయిందికూడా. హఠాత్తుగా అందరికీ మళ్ళీ జయంతి గుర్తువచ్చింది. ఒక్కసారి అంతా జయంతీ జయంతీ అని పిలవటం మొదలుపెట్టారు. విన్పించినా జయంతి నిలబడ్డచోటునుంచి ఒక్కడుగు కూడా కదపలేదు.

ఓ ప్రక్క రేఖారాణీ యింకో ప్రక్క అతను నడుస్తుండగా జయంతివైపు వచ్చిన సుమిత్రాదేవి ఆగి "జయంతీ! నువ్వింకో అరగంటవుండి వాళ్ళవన్నీ సర్దించేసింతర్వాత వెళ్ళు. నేనుకూడా వుండేదాన్ని కాని మా చిన్నబ్బాయికి జ్వరం. ఒళ్ళు పేలిపోతోంది. నేను రాకపోతే పని జరగదని తప్పని సరిగా వచ్చాను." అంటూ "రేఖారాణీ! పోదామా" అంది ప్రక్కకు తిరుగుతూ.

రేఖారాణి నల్లంచు పువ్వులున్న తెల్లసిల్కుచీరె కట్టుకుంది. గుండెల్లోకి దిగిపోయిన నెక్‌వున్న జాకెట్టు. మెళ్ళో ముత్యాలపేరు. చేతిమీద "షాల్". నడినెత్తిమీద చుట్ట. చుట్టనుంచి ఒకప్రక్కకు వేళ్ళాడుతున్న మల్లెపూలు. మనిషి నలగలేదు. చెదరలేదు. అప్పుడే తయారై వచ్చినట్టుంది. జయంతికి క్షణంసేపు విపరీతమైన యీర్ష్య అన్పించింది. తనే రేఖారాణి అయి. రేఖారాణి జయంతి యెందుకు కాగూడదు! మంత్రిప్రక్కన యెంత ఠీవిగా కూర్చుంది!

"రండి. మీరుకూడా" పరధ్యానంగా నిలబడిపోయిన అతనివైపు చూస్తూనే అంది రేఖారాణి.

"నేనా? నేనుకూడా వుండి యివన్నీ చూస్తాను. నాకు నిద్ర రావటం లేదు" అన్నాడు.

"నిజంగా! మెనీ మెనీ థాంక్స్." సుమిత్రాదేవి మనసులో కలిగిన సంతోషాన్ని కళ్ళలో, కనుబొమ్మల్లో, మొహం



డాక్టరు: "మనిషి కనిపించకుండా ఎక్కడినించో తెలీకుండా మాటలు వినిపిస్తూవుంటాయా మీకు?"

రోగి: "చిత్తం."

డాక్టరు: "రాత్రిళ్ళా, పగలా?"

రోగి: "టెలిఫోను మోగుతుంటే ఎత్తినప్పుడల్లానండి."

అంతా ప్రతిఫలిస్తుండగా అంది. కాని రేఖా రాణి కనుబొమలు ముడుచుకున్నాయి.

"అయితే మీ రెందుకు రండి డ్రాప్ చేస్తాం." అంది రేఖారాణి.

"నో, నో. ఉండనివ్వు. నేను వూరికే సాయంత్రం వుంటానన్నానంతే." అన్నాడతను. అతనిమాట లెందుకో రేఖారాణికి నచ్చి నట్టులేదు. ఆ నచ్చకపోవటం అతనికిపట్టి నట్టులేదు. సుమిత్రాదేవితో వెళ్ళిపోతున్న రేఖారాణి వెనక్కి తిరిగి జయంతివైపు వంకర చూపొకటి విసిరివెళ్ళింది. ఎందుకో తెలియదుగాని ఆ చూపు బాకులా సూటిగా వచ్చి జయంతి లేతమనసులో నాటుకుని కలుక్కుమంది.

అందరూ వెళ్ళిపోయారు. బైటలైట్లన్నీ తీసేశారు. లోపలకూడా ఒక్కొక్కలైటు తీసేస్తున్నారు. చిందర వందరగావేయబడిన స్పేర్ కుర్చీలుకూడా ఖాళీచేయబడు తున్నాయి.

"మీరు కూర్చోండి. నే నవన్నీ చూసి వస్తాను" అతను జయంతివైపు చూడకుండానే అనేసి వెళ్ళిపోయాడు. ఏం చెయ్యాలో తోచక హాలులో ఒంటరిగా నిలబడిపోయిన జయంతి ప్రక్కనున్న కుర్చీలో కూల బడింది. ఉదయం యెప్పుడో తిన్నతిండి. అదికూడా సరిగ్గా సయించనేలేదు. పగలల్లా తిరుగుతుంటే తెలియలేదుగాని ఇప్పుడు బోలెడంత నీరసం అనిపిస్తోంది. మధ్యలో కొంచెం కాఫీఅయినా తాగుదామంటే టైమ్ దొరకనేలేదు.

ఉదయంనుంచి తిరిగితిరిగి అలిసిపోయిన జయంతి కుర్చీలో కొంచెం అలా వెనక్కి వాలగానే కళ్ళమీదకి మత్తులాటిది వచ్చి ఆవరించుకుంది. అంతా మగతగా మంచుతెర కప్పినట్టుంది. ఏదీ స్పష్టంగా తెలియటం లేదు. ఎన్ని ఆలోచించిందితను. ఒక్కటీ కూడా జరగటంలేదు. అంతా యేదోసందడి. బోలెడంతమంది రకరకాలవాళ్ళు గుంపులు గుంపులుగా పోతున్నారు. వాళ్ళందరికీ దూరంగా-ఓ ప్రక్కగా ఒంటరిగా తను. తనకేంలేదు. ప్రత్యేకత అనేది అసలేలేదు.

ఎంత దిగులుగా అనిపిస్తోంది. తనకి యెవరూలేరు. బామ్మకితప్ప ఈ ప్రపంచంలో యెవరికీ తను అక్కర్లేదు. ఎంతదూరంగా వుంది తను! తనున్నచోట యెంత ఒంటరి తనం! తనచుట్టూ వలయంలా చుట్టుకు పోయిన యీ భయంకరమైన ఒంటరి తనాన్ని ఛేదించుకుని యెవరైనా జయంతీ అంటూ దగ్గరకు రాకూడదూ? తన పిచ్చి గాని యెవరొస్తారు? ఎవరికి కావాలి తను? లేదు. లేదు. ఎవరో కావాలంటున్నారు. నవ్వుతూ అస్పష్టంగా వున్న మొహం ఒకటి మీదకు వంగి నువ్వు నాకు కావాలి అంటోంది.

ఇప్పుడెంత హాయిగావుంది. ఎవరిదో చేయివచ్చి తన చేతిని పెనవేసుకుంది. ఆ స్పర్శ యెంత ధైర్యాన్నిస్తోంది. ఆచేతిని పట్టుకుని అలా అలా దూరతీరాలకు ఎగిరి పోతే యెంత బాగుండును? తనచేతిలో నుంచి జారిపోబోయి తప్పించుకోబోతున్న ఆ చేతిని మరింత బలంగా దగ్గరకి పట్టు కుని గుండెలకి దగ్గిరగా లాక్కుంది జయంతి. ఏదో నూతన స్పర్శ. ఏదో తెలి యని సువాసన. అర్థంగాని ఆనందం. జయంతిని వుక్కిరి బిక్కిరి చేశాయి.





జయంతి వులిక్కిపడి లేచింది. ఎదురుగా అతను. అతనిచెయ్యి తన రెండు చేతుల్లో. జయంతికి క్షణంసేపు తనెక్కడుందో, కళ్ళముందు తనేం చూస్తోందో అర్థం గాలేదు. తెల్లబోయిన జయంతి ఒక సారి చిరునవ్వుతో వున్న అతని మొహం లోకి, యింకోసారి తన చేతుల్లోవున్న అతని చేతివైపు చూసింది.

"అదేమిటి తలేవారే! కూర్చోండి అని చెప్తే హాయిగా నిద్రపోతున్నారా? పైగా లేపుదామని తట్టబోతే చెయ్యిగట్టిగా పట్టు కున్నారు" నవ్వుతూ అంటున్న ఆమాటలు జయంతిని పూర్తిగా యీలోకంలోకి తీసుకు వచ్చాయి. చప్పున చేతిని వదిలేసి నిల బడింది. కాని ఈసారి అతను వదలలేదు. జయంతి చేతినిపట్టి కొద్దిగా పైకెత్తుతూ మృదువుగా, "చాలా అలసిపోయారులా వుంది-అవునా?" అన్నాడు అప్పటికేసిగ్గుతో నరనరం మెలిదిరిగిపోతున్న జయంతి అవునన్నట్టు గబగబా తలూపింది. హాలులో యిందాకటిలా దేదీప్యమానంగా వెలుగు తున్న లైట్లులేవు. హాలుకి మధ్యగా వెలుగు తున్న లైటుమాత్రం వుంది. స్టేజిని యెప్ప టిలా తనలో దాచేసుకున్న పసుపుపచ్చటి వెల్వెట్ కర్టెన్ మామూలుగా యేమీ యెర గనిదానిలా వేళ్లాడుతోంది. "పదండి వెళదాం" అన్న అతని మాటలతో జయంతి కదిలింది. ఇద్దరూ బైటకొచ్చేశారు. వరండాకి కొద్ది దూరంలో వెన్నెలలో నల్లగా నిగనిగలాడు తున్న కారొకటి నిలబడివుంది. దాన్ని చూడగానే జయంతి వులిక్కిపడినట్టుగా "నే వెళ్ళటం ఎలా" అనుకుంది. ముందు చకచక మెట్లుదిగుతున్న అతను హఠాత్తుగా ఆగి వెనక్కితిరిగి "యేమిటి" అన్నాడు.

అతనివెనకే దాదాపు అంత వేగంతో గబగబా దిగివస్తున్న జయంతి హఠాత్తుగా అతను ఆగటంతో అతనిమీద తూలిపడ బోయి అతి ప్రయత్నంమీద గుండెలదగ్గ రగావచ్చి ఆగిపోయింది.

"ఏమిటి?" ఇంకోసారి అడిగాడు అతను.

"నేను వెళ్ళటం యెలా?"

"నడిచివెళ్ళండి. రిక్షాలుండవు. బస్సు లిప్పుడురావు." అతను మళ్ళీ నవ్వుతూ అన్నాడు. జయంతికి కోపంవచ్చింది. పరిచయంలేని మనిషితో పరాచకం ఆడటం మర్యాదస్థుల లక్షణంగాదు.

---

● ఒక కుర్రాడు పెంపుడుకుక్కని గొలుసుపట్టుకుని నడిపించుకు తీసుకుపోతున్నాడు. ఒకాయన కుర్రాడికేసి ముచ్చటగా చూసి

"కుక్కని పెంచుకుంటున్నావా అబ్బాయ్? దానిపేరేమిటీ!" అని అడిగాడు.

"అసలుపేరేమిటో తెలియదుగాని నేను జాకీ అని పిలుస్తానండి." అన్నాడు కుర్రాడు.

"రండి. యింకొంచెం సేపయితే మీరు నడుస్తూనే నిద్రపోయేలావున్నారు" కారు తలుపుతెరిచి పట్టుకుంటూ అన్నాడు. జయంతికి నవ్వు వచ్చింది. కోపం యెక్కువైందికూడా. అటువైపుగా తిరిగివచ్చి డ్రైవింగ్ సీటులో కూర్చున్న అతను కారు స్టార్ట్ చేస్తూ "దారిచూపించాలి" అన్నాడు.

గేటుదాటి బైటకురాగానే జయంతి చెప్పినవైపు అతను కారు తిప్పాడు. దగ్గర దగ్గర ఒంటిగంట కావస్తుండటంవల్లవీధులన్నీ నిర్మానుష్యంగావున్నాయి. వెన్నెల్లో అర్థరాత్రివేళ నిశ్శబ్దంగావున్న వాతావరణం జయంతి నిద్రమత్తు కళ్ళకి యింకా యెలాగోవుంది. ఖరీదుగల కారు. మెత్తని సీటు. బైటనుంచి రివ్వున వీస్తున్న చల్లటిగాలి.

"మీ యింట్లో యెవరెవరుంటారు?"

"బామ్మా నేను." క్షణంసేపు ఆగి జవాబుచెప్పింది.

"అదేం? యింకెవ్వరూ లేరూ?"

"ఊహూ."

"అమ్మా, నాన్నా?"

"చిన్నప్పుడే పోయారు." బైట వెన్నెలలోకి చూస్తూ అంది. ఇద్దరిమధ్య మౌనం ఆవరించింది. ఉన్నట్టుండి అతను నిట్టూర్పు విడవటం వినిపించింది. జయంతి తలతిప్పి చూసింది. రోడ్డుమీద దృష్టిని నిలిపి డ్రైవ్ చేస్తున్న అతను జయంతివైపు చూడలేదు. కొంచెం ఆగి "మీరు నాకంటె అదృష్టవంతులు" అన్నాడు

"ఎలా?" జయంతికూడా రోడ్డువైపు చూస్తూ అంది. రోడ్డుకి అటు యిటు నిలబడ్డ చెట్ల నీడలతో వెన్నెల దోబూచులాడుతోంది.

"మీకు కనీసం బామ్మయినా వున్నారు. నా కెవరూలేరు"

జయంతి వూరుకుంది. ఇతనెవరో తనకింతవరకూ తెలియనేలేదు. అడగటానికి ధైర్యం చాలలేదు. అతనిమాటలు స్నేహపూర్వకంగా యెన్నోరోజులనుంచి పరిచయం వుండి మాట్లాడుతున్నట్టుగా వున్నాయి.

"అసలు మీరీ వుద్యోగానికెందుకు వచ్చారు?"

జయంతి వులిక్కిపడింది. "బావుంది. అందరూ యెందుకు వుద్యోగాలు చేస్తారు?" జయంతి యెదురుప్రశ్నవేసి జవాబు తప్పించుకుంది.

"అందరూ యెందుకు చేస్తారనేది అర్థంలేని ప్రశ్న. కొంతమంది సరదాకి చేస్తారు. కొంతమంది చేస్తున్నాం అనే గొప్పకోసం చేస్తారు. ఇంకా కొంతమంది తిండికోసం చేస్తారు. కొంతమంది తోచక కాలక్షేపానికి చేస్తారు." అతని మాటలకి పదునుంది.

"వాటిలో యే ఒక్క కారణం అయినా కావచ్చు. బహుశా ఏదో ఒకటి తప్పక అవుతుందికూడా."

"ఏ కారణాన వచ్చినా మీరీ ఉద్యోగంలో యెక్కువ రోజులు వుండలేరు. అదిమటుకు ఖచ్చితంగా చెప్పగలను. కావాలంటే పందెంవేస్తాను."

బాగుంది జోస్యం! జయంతి అహం దెబ్బతింది. ఎంత అనవసర ప్రసంగం అనిపించిందికూడా. సంభాషణ పొడిగించటం



యిష్టంలేనట్టు తలతిప్పి బయటకు చూడసాగింది.

"నే నీ ఉద్యోగం చెయ్యలేనని మీ కెలా చెబుతున్నారు?" బైటకుచూస్తున్న జయంతి అర్థమవ్వకుండా వుండలేకపోయింది.

"కొంతమందిని చూస్తూనే కొన్ని విషయాలు అర్థమైపోతాయి. మీ సంగతి తెలియకపోయినా వనితా విహార్ సంగతి బాగా తెలుసు."

జయంతి యేదో సమాధానం చెబుదాం అనుకునే లోపలనే యిల్లు వచ్చేసింది.

"అరె ఆపండి, ఇక్కడే" సడెన్ బ్రేక్‌తో కారు ఆగిపోయింది.

"థ్యాంక్స్ వస్తాను." ఇంకోమాట చెప్పకుండా, చెప్పేందుకు అవకాశం ఇవ్వకుండా జయంతి డోరు తెరుచుకుని దిగింది.

"ఎక్కడా యిల్లు? ఫర్వాలేదా?"

"అదుగో ఆ కన్పించేదే. వస్తాను"

"ఆల్‌రైట్. గుడ్‌నైట్." అంటూ అతను జయంతి వేసిన తలుపు సరిగ్గా పడలేదని గ్రహించి ముందుకు వంగి చెయి చాచాడు.

"ఇంతకీ నే నడగలేదు. మీరూ చెప్పలేదు మీ పేరు?" బొమ్మలా నిలబడిపోయిన జయంతి అతనివైపే చూస్తూ అడిగింది.

"నా పేరా?" తలుపువెయ్యబోతున్న అతను ఆగి "అవును నిజమే-సుమిత్రాదేవి నన్ను పరిచయం చెయ్యనేలేదుగదా! మీకు తెలుసుకోవాలని కుతూహలంవుంటే నాపేరు రాజశేఖరం-" అన్నాడు డోరులాగి గట్టిగా వేసేస్తూ.

"రాజశేఖరమా?"జయంతి చేయి అనుకోకుండా గుండెలమీదకు వెళ్ళింది. కళ్ళు వెడల్పుఅయినాయి.

"అవును. అలాచూస్తారేం? మీకు నచ్చలేదేమో! తెలిసినవాళ్ళు శేఖరం అని. ఆప్తులు, స్నేహితులు రాజా అని పిలుస్తారు. వస్తాను. గుడ్‌నైట్-" కారు వెళ్ళిపోయింది


"మైగాడ్! రాజశేఖరం!" ఊపిరిపీల్చుకోవడం మర్చిపోయింది జయంతి.

(ఇంకా వుంది)

---

● ఒకగొప్ప తెలుగువాడికి షష్టిపూర్తి జరుగుతోంది. ఆయన్ని గంటసేపుగా ఇంద్రుడు, చంద్రుడు అని ప్రశంసిస్తూ అలిసిపోయిన ఒకవక్త ఆ వూపులో ఉత్సాహం పట్టలేక, "వీరు షష్టిపూర్తి చేసుకోవటం నాకుచాలా ఆనందంగావుంది. త్వరలోనే వీరికి నూరేళ్లునిండి శతజయంతి కూడా చేసుకోగలరని ఆశిస్తున్నాను" అనేసి నా లిక్కరుచుకున్నాడు.





# స్నేహం

బలరామ

"అమ్మాయి బాగానే ఉంది కదూ?" అన్నది సావిత్రి.

రైలు నత్తకన్నా వేగంగానే పరుగెత్తుతోంది. ఆ సెకండ్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో వాళ్ళుముగ్గురూ కాక మరోయిద్దరు- భార్యా,భర్త కాబోలు-ఉన్నారు. కిటికీదగ్గర కూచుని బైటికి చూస్తూన్న పార్థసారధి సావిత్రి ఉత్కంఠతతో తనలోతానే నవ్వుకో సాగాడు.